నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌ఎస్‌పీడీసీఎల్–11 కేవీ ఆజామ్‌బాద్ డివిజన్‌లో విద్యుత్ మరమ్మతు పనుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. వైఎంసీఏ ఫీడర్ పరిధిలో నారాయణగూడ బ్లెడ్ బ్యాంక్, లింగంపల్లి వాటర్‌వర్క్స్, రాఘవేంద్ర స్వామి దేవాలయం, నృపతుంగ కాలేజ్ తదితర ప్రాంతాలలో 9.30 నుంచి 11.30 వరకు, బసంత్ కాలనీ ఫీడర్ పరిధిలో బసంత్‌కాలనీ, లింగంపల్లి, వైశ్య హాస్టల్, వెంకటరమణ థియేటర్, జెయిన్ మందిర్, కాచిగూడ ఎక్స్‌రోడ్ తదితర ప్రాంతాలలో 11.30 నుంచి 1.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. ఫీవర్ ఆస్పత్రి ఫీడర్ పరిధిలో ఫీవర్ ఆస్పత్రి, అంజయ్య క్వాటర్స్, తెలంగాణ యువతి మండల్, బర్కత్‌పురా పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో 2.30 నుంచి 4.30 వరకు, మౌలానా ఆజాద్ నగర్ ఫీడర్ పరిధిలో చప్పల్ బజార్, కుమార్ థియేటర్, రహమత్‌బాగ్, క్వాలీ గార్డెన్ తదితర ప్రాంతాలలో 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

సౌత్ ఇండియా క్రౌన్‌ను సాధించిన శ్రావ్య చిల్ల

హిమాయత్‌నగర్: హైదరాబాద్ నగరానికి చెందిన శ్రావ్య చిల్ల మిస్ అండ్ మిసెస్ ఇండియా పోటీలలో సౌత్ ఇండియా క్రౌన్‌ను సాధించింది. ఢిల్లీ నోయిడాలో క్వీన్ ఆఫ్ హార్ట్స్ సంస్థ నిర్వహించిన అందాల పోటీలలో పాల్గొని తాను సౌత్ ఇండియా క్రౌన్‌తో పాటు మిసెస్ ఫిట్, మిసెస్ పర్ఫెక్ట్ బాడీ–2024 వంటి రెండు సబ్ టైటిల్‌లను కూడా సాధించడం ఆనందంగా ఉందని విజేత శ్రావ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

వామ్మో.. వాంబే ఇళ్లు!

- శిథిలావస్థకు చేరిన వాంబే గృహాలు
- ప్రమాదకరంగా పై కప్పులు
- పైకి తేలిన ఇనుప చువ్వలు


వాంబే గృహ సముదాయం


పెచ్చులు ఊడిన మెట్ల పైకప్పు

కవాడిగూడ: కవాడిగూడ డివిజన్ పరిధిలోని భీమా మైదాన్‌లో ఉన్న 'వాంబే' (వాల్మీకి అంబేడ్కర్ అవాస్‌యోజన) గృహాలు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడు ఏ ఇంట్లో పెచ్చులు ఊడి పైన పడతాయోనని బిక్కు బిక్కుమంటూ ప్రజలు గడుపుతున్నారు. ఈ ఇళ్ల ప్రమాదకరంగా మారడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అప్పటి ప్రభుత్వం 2004 సంవత్సరంలో నిర్మించిన ఈ గృహ సముదాయానికి సగానికిపైగా ఇండ్లు శిథిలావస్థకు చేరాయి. భవనాలకు పగుళ్లు ఏర్పడ్డాయి. గోడలు, పై కప్పులు బీటలు తేలాయి. మెట్ల వరసలు పాడైపోయి కొన్ని భవనాలలో నిర్మాణ సమయంలో ఉపయోగించిన ఇనుప చువ్వలు పెచ్చులూడి బయటకు కనిపిస్తున్నాయి. గడచిన ఐదారేళ్లలో పలు బ్లాకుల్లో శిథిలాలు పడి గాయపడిన సందర్భాలు కోకొల్లలు.


లీకేజీల కారణంగా దెబ్బతిన్న ఓ బ్లాక్



సొంతంగా మరమ్మతులు చేయించినా మారని పరిస్థితి...

సొంతంగా మరమ్మతులు చేయించుకుంటున్న అది మూడు నాళ్ల ముచ్చటగానే మారుతుంది. నిర్మాణ సమయంలో నాణ్యత లోపాలు కూడా ఇందుకు కారణమని అక్కడివారు చెబుతున్నారు. గతంలో ఓ బ్లాక్‌లోని మూడవ ఫ్లోర్‌లో ఓ ఫ్లాట్‌లో పై కప్పు కూలి మంచపై నిద్రిస్తున్నవారిపై పడడంతో వారు గాయపడ్డారు. చిన్నచిన్న ప్రమాదాలు సర్వసాధారణంగా మారాయి.

బిక్కు బిక్కుమంటూ జీవనం...

వాంబే పథకంలో భాగంగా 2004 సంవత్సరంలో మొత్తం 496 ఇండ్లను నిర్మించారు. జీ ప్లస్ 2 విధానంలో నిర్మించిన భవనాలలో చాలా వరకు ఇండ్లు రేపో మాపో అన్నట్లుగా ఉన్నాయి. కొన్ని ఇండ్లలో ఏకంగా ఫ్యాన్‌లు ఊడిపోతున్నాయి అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. భయంతో కొన్ని ఫ్లాట్‌లలో సీలింగ్ ఫ్యాన్‌లను తొలగించి టేబుల్ ఫ్యాన్‌లను వినియోగిస్తున్నారు. పై కప్పు పెచ్చులు ఊడడంతో వర్షం కురుస్తే నీరు కారుతుంది. సుమారు 200లకు పైగా ఇండ్లు శిథిలావస్థకు చేరాయి. ఎప్పుడేం జరుగుతుందో నని నివాసితులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడుపుతున్నారు.

రూ. 100 కోట్లు అన్నారు...

గ్రేటర్ హైదరాబాద్‌లోని వాంబే గృహాల మరమ్మతులకు రూ. 100 కోట్లు కేటాయించనున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఈలోగా ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ ప్రకటనకే పరిమితం అయింది. ఎన్నికల కోడ్‌తో ముందుకు వెళ్లలేని పరిస్థితి. ఎన్నికలు ముగియడం, కొత్త ప్రభుత్వం రావడంతో మరమ్మతుల పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. గతంలో ప్రకటించిన నిధులు మంజూరు చేస్తారో లేదోననే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి వాంబే ఇండ్లను బాగు చేయాలని, ప్రమాదాలను నుంచి తప్పించాలని నివాసితులు కోరుతున్నారు.

మరమ్మతులు చేయించాలి



స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ వాంబే గృహ సముదాయంలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి., హౌసింగ్ బోర్డు, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించి భవనాలకు మరమ్మతులు చేసి మా ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– లక్ష్మి, నివాసితురాలు

అర్హులందరికీ కేంద్ర పథకాలు


పటేల్‌నగర్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: దేశ ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి ప్రధాని నరేంద్రమోడీ ప్రవేశ పెట్టిన పథకాలు ఎంతో తోడ్పాటును ఇస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. గురువారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట డివిజన్ పటేల్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఆధార్ కార్డు సవరణ, ఉజ్వల గ్యాసు కనెక్షన్‌లు, ముద్ర రుణాలు వంటి అంశాలను ప్రజలకు కేంద్ర మంత్రి వివరించారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, బీజేపీ నేతలు నాగభూషణంచారి, ఆనంద్‌గౌడ్, భిక్షపతి, నవీన్‌రెడ్డి, కృష్ణ ముదిరాజ్, హారతి, రాంచందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభం


పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట్: నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం బాగ్ అంబర్‌పేట డివిజన్ సీఈ కాలనీలో రూ. 6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో పైప్ లైన్ వ్యవస్థను ఆధునికీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కాలనీ వాసులతో చర్చించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'రాజ్యాంగ విలువలకు కేంద్రం తిలోదకాలు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నదని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు విమర్శించారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్కైల్యాబ్‌బాబు మాట్లాడుతూ... బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ప్రజలందరు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. దేశంలో మతాలన్ని సమైక్యత స్ఫూర్తితో పని చేయాలని కోరారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక అధ్యక్షుడు కె.వెంకట్, ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య, నాయకులు ఆర్.వెంకటేష్, సాయమ్మ, రాజు, మధుబాబు, నాగలక్ష్మి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భోలక్‌పూర్‌లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తాం


కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ తదితరులు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: భోలక్‌పూర్ హౌస్‌లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హామీ ఇచ్చారు. బుధవారం భోలక్‌పూర్ హౌస్ వద్ద కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన సమస్యలను సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే డ్రైనేజీ నూతన పైప్‌లైన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని వెంటనే పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. ముషీరాబాద్ చౌరస్తా నుంచి కవాడిగూడ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణలో వ్యాపారులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా పనులు చేపట్టే విధంగా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. రోడ్డు విస్తరణపై ఆందోళన చెందవద్దని వ్యాపారులకు సూచించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కవాడిగూడ, ముషీరాబాద్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాకేష్ గుడినియా, ఉపాధ్యక్షులు టి.సంజీవ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.రాజు, పద్మశాలీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఆంజనేయులు, అసోసియేషన్ నాయకులు డాక్టర్ యాదగిరి, డాక్టర్ విజయ్‌మోహన్, బీఆర్‌ఎస్ భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, ఆర్.శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకాంత్, కృష్ణ, యూత్ కమిటీ అధ్యక్షుడు సాయి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


డైరీని ఆవిష్కరిస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కవాడిగూడ: సెంట్రింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, కార్మిక భద్రత, వారి జీవనోపాధి తదితర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు పి. కృష్ణ మాట్లాడుతూ... ప్రమాదవశాత్తు సెంట్రింగ్ కార్మికులు మరణిస్తే కార్మిక సంక్షేమ బోర్డు చెల్లించే నష్ట పరిహారం గుర్తింపు కార్డు ఉన్నాలేకున్నా పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ప్రకారం కార్మికులకు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అసోసియేషన్ చైర్మన్ ఎస్ పరుశురాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.డి చంద్‌పాషా, కోశాధికారి సి.విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు బి. కనకరాజు గౌడ్, ఎం.డి.అహ్మద్, టి.ఫల్గునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాములోరి పాదుకలకు పూజలు


రాములోరి పాదుకలకు పూజలు నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి: అయోధ్యలోని భవిష్య రామమందిరానికి చేరబోయే శ్రీరాములవారి పవిత్ర పాదుకలు బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్ ఆవరణలో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అక్కడికి చేరుకుని భక్తిపారవశ్యంతో పాదుకలు దర్శించుకున్నారు. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్, బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అపార్ట్‌మెంట్ వాసులతో కలసి పాదుకల పూజలు నిర్వహించిన అనంతరం కార్యక్రమం ఊరేగింపు కార్యక్రమం నేత్ర పర్వంగా సాగింది. శ్రీరాములవారి పాదుకలను పెద్ద ఎత్తున దర్శించుకుని భక్తులు పూజలు నిర్వహించారు. అపార్ట్‌మెంట్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఫ్లాట్స్ నివాసితులు మురళీ, నాగేందర్, సురేశ్, అనీల్, శ్రీనివాస్, రవి, నాగేందర్, లక్ష్మణ్, నిరంజన్ పాల్గొన్నారు.

నేషనల్ కర్లింగ్ పోటీల్లో తెలంగాణకు పతకాలు

హిమాయత్‌నగర్: మూడవ నేషనల్ కర్లింగ్ చాంపియన్‌షిప్ 2023–24 పోటీలలో తెలంగాణ బంగారు, కాంస్య పతకాలు సాధించింది. కశ్మీర్ గుల్మార్గ్‌లో జనవరి 5 నుంచి 9వ తేదీల్లో జరిగిన మూడవ నేషనల్ కర్లింగ్ చాంపియన్ షిప్ పోటీలలో తెలంగాణ నుంచి మిక్స్‌డ్ డబుల్స్‌లో పాల్గొన్న బి.ఎం.పవన్ కుమార్, నాగ అక్షయ బంగారు పతకాలు సాధించారు. మిక్స్‌డ్ టీంలో పాల్గొన్న ఎం.నరసింహారెడ్డి, జి.కృష్ణమూర్తి, ఎ.రాకేష్, ఎం.లక్ష్మీచైతన్య కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని కర్లింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ రొయ్యూరు సురేష్, ప్రధాన కార్యదర్శి లయన్ వి.వసంతమాధురి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రష్మీ సలూజా, రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్ ఆటగాళ్లను సత్కరించి ప్రోత్సహించారు.

థియేటర్లలోని కార్మికులకు పనికితగ్గ వేతనం ఇవ్వాలి


జేసీఎల్‌కి వినతిపత్రం అందజేస్తున్న మారన్న

చిక్కడపల్లి: సినిమా థియేటర్‌లలో 8 గంటల కంటే అదనంగా పనిచేస్తున్న కార్మికులకు పనికి తగిన వేతనాన్ని ఇవ్వాలని తెలంగాణ సినిమా థియేటర్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు ఎస్.మారన్న డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని కార్మికశాఖ జంట నగరాల సంయుక్త కమిషనర్ శ్యాంసుందర్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా మల్టీప్లెక్స్, సింగల్ థియేటర్‌లలో రోజుకు నాలుగు ఆటలే కాకుండా స్పెషల్, బెనిఫిట్ షోల పేరిట అదనపు షోలను ప్రదర్శించడంతో కార్మికులు 8 గంటల కంటే ఎక్కువ సమయం పనిచేయాల్సి వస్తుందన్నారు. దీంతో వారు ఒత్తిడికి లోనవుతున్నారన్నారు. థియేటర్ల యాజమాన్యాలు కార్మికులు పనికి తగిన విధంగా వేతనాన్ని ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంపై అధికారులు స్పందించి అదనపు పని గంటలకు వేతనాన్ని ఒప్పించాలని కోరారు. సంఘం కార్యదర్శి కె.అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పి.పుల్లారావు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీల పేరుతో మోసగిస్తున్న కాంగ్రెస్


సమస్యలు తెలుసుకుంటున్న కిషన్‌రెడ్డి

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, ఇండ్ల నిర్మాణం కోసం నిధులు ఎలా సమీకరిస్తారని, ఏ ప్రాతిపదికన వాటిని కేటాయిస్తారో రాష్ట్ర ప్రభుత్వానికి అవగాహన లేదని విమర్శించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని బషీర్‌బాగ్, చంద్రనగర్ బస్తీలో కిషన్‌రెడ్డి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను కాంగ్రెస్ మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్లలో సంక్షేమ పథకాలను, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వారి అనుచరులకు కట్టబెట్టి అసలైన పేదలకు అన్యాయం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ నగర అభివృద్ధికి నిధులు కేటాయించిదన్నారు. ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ నేతలు ప్రేమ్‌రాజ్, సురేష్ కుమార్, గౌతమ్‌రావు, పందిర్ల ప్రసాద్, బస్తీ ప్రజలు కె.టి.డి.నాయుడు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేయూతనివ్వాలి

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్


సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తదితరులు

చిక్కడపల్లి: పేదలకు చేయూతనిచ్చేందుకు ప్రతి ఒక్కరూ మానవతాదృక్పథంతో కృషి చేయాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. బుధవారం మైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలను డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం బన్సీలాల్ పేటలోని వికలాంగుల ఆశ్రమంలో అన్నదానం, గాంధీ ఆస్పత్రి వద్ద రోగుల సహాయకులకు అన్నదానంతో పాటు ఆర్థిక సాయాన్ని అందించారు. సినీనటుడు శ్రీధర్‌రావు, నేతలు ఎం.అరవింద్‌యాదవ్, అభిషేక్ కెనడీ, సురేష్, గుండు జగదీశ్‌బాబు, ఎం.నర్సింగరావు, వినయ్, శ్రీకాంత్, అనిల్‌గౌడ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి


అంజన్‌కుమార్‌యాదవ్‌కు బంగారంతో తయారు చేసిన మెమొంటోను అందజేస్తున్న బోన్‌మోన్ మహేష్

మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమిని కాలనీలో ముషీరాబాద్ అసెంబ్లీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రజల్లో ఆధ్యాత్మిక భావన పెంపొందించేందుకు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సహకరిస్తున్న మజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్‌ను అసోసియేషన్ నాయకులు బంగారంతో తయారు చేసిన మెమొంటోను అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... ప్రస్తు యాంత్రిక జీవన విధానంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ అసెంబ్లీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుడు బి.మహేష్, చైర్మన్ చరక నవీన్, కోశాధికారి అనిల్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పన యాదవ్, యూత్ కాంగ్రెస్ నగర నాయకులు అరవింద్‌కుమార్‌యాదవ్, అసోసియేషన్ సలహాదారులు జనిగే శ్రీనివాస్ యాదవ్, నరేష్, మోహన్‌రాజ్, రవి తదితరులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమిరెల్లి మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గోపన్నపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 36, 37లలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మానవతాదృక్పథంతో ఉద్యోగుల కోసం ఇళ్ల స్థలాలను కేటాయించిందని అన్నారు. అయితే 2014లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నెల రోజులకే ఇళ్లు నిర్మించుకోలేదనే నెపంతో మా సొసైటీకి చెందిన భూమిని వెనక్కి తీసుకొని మాకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేము కోరుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వచ్చినందున మా భూమిని మాకు తిరిగి కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఈ విషయంపై వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, ఆర్గనైజేషన్ సెక్రటరీ జి.చంద్రకళ, ట్రెజరర్ వి.దివాకర్, కార్యవర్గ సభ్యులు కె.లక్ష్మణ్‌రావు, పుట్టలయ్య, ఝాన్సీరాణి, డి.పవన్‌కుమార్, వి.రామనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.


తెలంగాణ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కేలండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

నంబర్ ప్లేట్ లేని వాహనదారులపై కేసులు నమోదు


వాహనాన్ని విడుదల చేస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్‌ప్లేట్ లేని వాహనదారులపై ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య ఆధ్వర్యంలో బుధవారం కేసులు నమోదు చేశారు. అనంతరం వారికి కౌన్సిలింగ్ ఇచ్చి నూతన నంబర్ ప్లేట్ పెట్టించి విడుదల చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో 10 వాహనాలను పట్టుకుని కేసులు నమోదు చేసిన పోలీసులు కేసులు నమోదు చేసి ధ్రువపత్రాలను పరిశీలించి సరైన నంబర్ ప్లేట్ పెట్టించి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ... వాహనాదారులు సరైన నంబర్ ప్లేట్ వేసుకుని వాహనాలను నడపాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జూనియర్ కాలేజెస్ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజెస్ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం బర్కత్‌పురాలోని రత్నజూనియర్ కళాశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి.ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా పి.సుధాకర్ రెడ్డి, కోశాధికారిగా సి.పి.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అహ్మద్ హుస్సేన్, ఎం.డి.ఉస్మాన్, జాయింట్ సెక్రటరీగా సిద్ధిఖి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఎం.డి.అక్రం, షేక్ హైదర్, సలహాదారులుగా వి.హన్మంతరావు, డాక్టర్ ఎస్.శ్రావణ్‌కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా విష్ణువర్ధన్‌రెడ్డి, కోర్ కమిటీ సభ్యులుగా డాక్టర్ బాలకృష్ణారెడ్డి, ఎస్.పి.పార్థసారథిలు వ్యవహరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కాలేజెస్ మెనేజ్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షుడు గౌరీ సతీష్ మాట్లాడుతూ... నోటిఫికేషన్ ఇవ్వకముందే కొన్ని కళాశాలలో అడ్మిషన్స్ జరుగుతున్నాయని వాటిని వెంటనే ఆపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

13న పతంగుల తయారీపై వర్క్‌షాప్

బంజారాహిల్స్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని సింప్లి నామ్‌ధారీస్‌లో చిన్నారులకు గాలిపటాల తయారీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఆదర్శ్‌రామ్ ఒక ప్రకటనలో తెలిపారు. 5–12 సంవత్సరాల వయస్సు కలిగిన చిన్నారులకు ఈ నెల 13న ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు ఈ వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. ఇందులో పతంగుల తయారీ విధానాన్ని పిల్లలకు వివరించడంతో పాటు వారితో తయారు చేయించి జీవితాంతం గుర్తుండిపోయేలా జ్ఞాపకాలను వారికి అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు ఫోన్: 63022 41108.